RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

నీట్ అభ్యర్థులకు గుడ్ న్యూస్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం 2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 140 | జూన్ 19 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 140 | JUN 19 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా..

### దేశంలో ఇంధన ధరల తగ్గింపు ఇప్పట్లో కష్టమే: కేంద్రం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభం ముగిసి, హెర్మూజ్ జలసంధి గుండా రవాణా పునఃప్రారంభమైనప్పటికీ దేశీయంగా ఇంధన ధరలు వెంటనే తగ్గే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగివస్తున్నా, ఆ ప్రయోజనాన్ని దేశీయ వినియోగదారులకు వెంటనే బదిలీ చేయలేమని కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ అంశంపై పెట్రోలియం, సహజ

మిగతా 2వ పేజిలో..




## ఆధార్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే..

### పౌరసత్వానికి రుజువు కాదు: సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ఆధార్ కార్డు వినియోగాన్ని కేవలం వ్యక్తిగత గుర్తింపు (ఐడెంటిటీ వెరిఫికేషన్) కే పరిమితం చేయాలని, దానిని పౌరసత్వం, నివాసం లేదా పుట్టిన తేదీ ధృవీకరణల కోసం ప్రూఫ్‌గా ఉపయోగించకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై స్పందించాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాలు,

మిగతా 2వ పేజిలో..




## హైదరాబాద్‌లో జనసేన నూతన కార్యాలయం

### నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలో జనసేన పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని మల్కం చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ నూతన భవనం వేదికగా తెలంగాణలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం మరియు నూతన చేరికలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులకు, జనసైనికులకు, వీరమహిళలకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. దీంతో ఈ వేడుకకు భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన ముద్ర వేసేందుకు

మిగతా 2వ పేజిలో..

# కబ్జాదారుల కోసమే హైడ్రా..

### పేదల జోలికి వెళ్లదు: వనమహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ



**హైదరాబాద్ జనసంఘర్షణ**

రాష్ట్రంలో ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్క్‌లో గురువారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, నాగలింగం మొక్కను నాటారు. ఈ సందర్భంగా రూ. 35.50 కోట్లతో ఎకో పార్క్, రూ. 17.84 కోట్లతో గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకే 'హైడ్రా' (న్ణ=ూూూ)ను తీసుకువచ్చామని, అయితే కొందరు దీనిని భూతంలా చిత్రీకరిస్తూ ప్రజలను భయపెడుతున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. హైడ్రా ఎన్నటికీ నిరుపేదల జోలికి వెళ్లదని, చెరువులను, ప్రభుత్వ స్థలాలను మింగేస్తున్న పెద్దల భరతం పడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. గుర్రంగూడ ఎకో పార్క్‌తో పాటు వనస్థలిపురంలోని దేవుడి భూములను కూడా కబ్జా చేయడానికి కొందరు కుట్రలు పన్నారని దుయ్యబట్టారు.

దేశ రాజధాని ఢిల్లీ తరహాలో హైదరాబాద్ నగరం కాలుష్య కోరల్లో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే పెద్ద ఎత్తున గ్రీనరీ పెంపకానికి, వనమహోత్సవానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టులు, ఎన్జీటీ (చీ+ు)లో కేసులు వేసినా మూసీ నది ప్రక్షాళన మరియు పునరుజ్జీవన పనులను ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని గంగా, సబర్మతి రివర్‌ఫ్రంట్‌ల కంటే అద్భుతంగా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. గతంలో మూసీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన సుధీర్ రెడ్డి.. ఇప్పుడు మూసీ పునరుజ్జీవాన్ని ఎలా వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. మూసీ నదిలో ఉన్న మురికి కంటే కల్వకుంట్ల కుటుంబం కడుపులోని కాలుష్యమే చాలా ప్రమాదకరమైనదని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు

మిగతా 2వ పేజిలో..

## నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సర్వం సిద్ధం

### పుకార్లను నమ్మవద్దన్న ఎన్‌టీఏ




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ పునఃపరీక్షను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మే 3న జరిగిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఆ పరీక్షను రద్దు చేసి, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, షెడ్యూల్ ప్రకారం జూన్ 21న దేశవ్యాప్తంగా రీ-టెస్ట్ నిర్వహించనున్నారు. పరీక్ష వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను, అసత్య ప్రచారాలను అభ్యర్థులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే ఫాలో అవ్వాలని ఎన్‌టీఏ

మిగతా 2వ పేజిలో..




## రామగుండం ఎరువుల కేటాయింపుకై కేంద్రంపై ఒతిడి

### మంత్రుల బృందంతో ఢిల్లీకి వెళ్తామన్న మంత్రి తుమ్మల

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల రాష్ట్రానికి రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం, ఆ మేరకు ఎందుకు సరఫరా చేయడం లేదని ఆయన

మిగతా 2వ పేజిలో..

# కబ్జాదారుల కోసమే హైడ్రా..

**మొదటిపేజీ తరువాయి..** వ్యాఖ్యలు చేశారు. నగర భవిష్యత్తు అవసరాల కోసం 30 వేల ఎకరాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, రాజకీయ భవిష్యత్తు లేని నేతలు దీనిని రద్దు చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానంటున్న వారు ముందు సిద్దిపేటలో గెలిచి చూపించాలని, ఆ తర్వాత దీని గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఆ ప్రాంత సమస్యల పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఆధార్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే..

**మొదటిపేజీ తరువాయి..** కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో.. ఆధార్ చట్టం-2016 లోని సెక్షన్ 9 ప్రకారం ఆధార్ అనేది కేవలం గుర్తింపునకు మాత్రమేనని, అది పౌరసత్వానికో లేదా శాశ్వత నివాసానికో రుజువు కాదని స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రస్తుతం పాఠశాల ప్రవేశాలు, ఆస్తుల కొనుగోళ్లు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల జారీతో పాటు కొత్త ఓటరు నమోదులో కూడా వయస్సు, నివాస ధృవీకరణ కోసం ఆధార్‌ను వాడుతున్నారని, ఇది చట్ట విరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిని ఆసరాగా చేసుకుని అక్రమ వలసదారులు, చొరబాటుదారులు సైతం ఆధార్ ద్వారా ఇతర ప్రభుత్వ అధికారిక పత్రాలను సులభంగా పొందుతున్నారని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల ధృవీకరణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పిటిషనర్ వాదించారు. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో.. సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే అత్యున్నత న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చింది.

## తెలంగాణలో ఘోర రహదారి ప్రమాదాలు: వేర్వేరు ఘటనల్లో ఎనిమిది మంది దుర్మరణం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. వేర్వేరు ప్రాంతాలలో చోటుచేసుకున్న ఈ ప్రమాదాల్లో మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.

టైరుమారుస్తుండగా లారీ ఢీకొని ముగ్గురు మృతి:

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలో తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించారు. దేవరుప్పుల మండలానికి చెందిన కిరాణా వ్యాపారి జాట్ రోహిత్, డ్రైవర్ మధుతో కలిసి టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుండి కిరాణా సరుకులతో వస్తుండగా నెల్లుట్ల వద్ద టైరు పంక్చరైంది. ఆ సమయంలో అదే దారిలో వెళ్తున్న ఒక లారీని ఆపి, దాని క్లీనర్ రాజేందర్ సహాయంతో కలిసి ముగ్గురూ టైరు మారుస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుండి వేగంగా దూసుకొచ్చిన మరో లారీ వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.

మేడ్చల్ వద్ద డివైడర్‌ను దాటి లారీని ఢీకొట్టిన కారు:

మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి-మురహరిపల్లి మధ్య జరిగిన మరో ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. కరీంనగర్ నుండి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుని అవతలి వైపునకు దూసుకెళ్లి, ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. కారు అతివేగంగా ఉండటంతో ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాలను కారులో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.

పరిగి మరియు సిరిసిల్లలో ఇద్దరు బలి:

వికారాబాద్ జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్ పాషా (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం బైపాస్ రోడ్డుపై జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న జగిత్యాలకు చెందిన అభిషేక్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ అన్ని ఘటనలపై స్థానిక పోలీసులు కేసులు నమోదు

# అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా..

**మొదటిపేజీ తరువాయి..** వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ గురువారం మాట్లాడుతూ.. ఇటీవల దేశంలో ఇంధన ధరలను లీటరుకు కేవలం రూ.3.94 మాత్రమే పెంచామని గుర్తుచేశారు. హొర్ముజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ, ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ విపరీతంగా పెరిగిందని వివరించారు. దీనివల్ల అంతర్జాతీయంగా తక్కువ ధరకు లభించే ముడి చమురు భారతదేశానికి చేరుకోవడానికి మరికొంత సమయం పడుతుందని, ఈ కారణాల వల్ల ధరలను వెంటనే తగ్గించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న సమయం నుంచి దేశీయ చమురు సంస్థలు తీవ్ర నష్టాలను చవిచూశాయని మంత్రి పేర్కొన్నారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రాలేదని, దీంతో ఆ భారం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి వచ్చిందని తెలిపారు. ఫలితంగా కేంద్ర ఖజానాకు సుమారు రూ.12,000 కోట్ల మేర ఆదాయ నష్టం వాటిల్లిందని, ఈ నేపథ్యంలో ఇంధన ధరల తగ్గింపుపై కేంద్రం ఇప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకునే ఉద్దేశంలో లేదని ఆయన వివరించారు.

## నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సర్వం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..** స్పష్టం చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ పరీక్ష నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో బహుళ అంచెల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్షకు మరో మూడు రోజులే సమయం ఉన్నందున, అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉంటూ తమ సన్నద్ధతపై దృష్టి పెట్టాలని ఎన్‌టీఏ కోరింది. ఒత్తిడిని అధిగమించడానికి 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్ 14416ను సంప్రదించవచ్చని సూచించింది. అదేవిధంగా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కూడా పిల్లలను మానసికంగా ప్రోత్సహిస్తూ, ధృవీకరించని సమాచారాన్ని వారితో పంచుకోకుండా, వారు ప్రశాంత చిత్తంతో పరీక్షకు హాజరయ్యేలా మద్దతుగా నిలవాలని ఎన్‌టీఏ విజ్ఞప్తి చేసింది.

## నీట్ అభ్యర్థులకు గుడ్ న్యూస్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం



**హైదరాబాద్**

జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. పరీక్ష రాసే అభ్యర్థులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపిస్తే చాలు, పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు మరియు తిరిగి వచ్చేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని, ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

మరోవైపు, ఈ ఏడాది నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పలు కీలక మార్పులు ప్రవేశపెట్టింది. పరీక్షను మరింత పారదర్శకంగా, సురక్షితంగా మరియు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా నిర్వహించడమే లక్ష్యంగా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందులో భాగంగా పరీక్ష సమయాన్ని ఈసారి 195 నిమిషాలకు పెంచారు. పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు కొనసాగుతుంది.

సాధారణంగా పరీక్ష ప్రారంభానికి ముందు అటెండెన్స్ పత్రాలపై సంతకాలు చేయడం, ఇన్విజిలేషన్ నిబంధనల పరిశీలన వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోతుంటారు. అభ్యర్థులు అలా సమయం నష్టపోకుండా ఉండేందుకే ఎన్‌టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. పరీక్ష రోజున విద్యార్థులకు పూర్తి సౌకర్యం కల్పించేందుకు తీసుకువచ్చిన ఈ మార్పులను అభ్యర్థులందరూ గమనించాలని, ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే శ్రద్ధ పెట్టాలని ఎన్‌టీఏ సూచించింది.

## హైదరాబాద్‌లో జనసేన నూతన కార్యాలయం

**మొదటిపేజీ తరువాయి..** మరియు పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ఈ నూతన కార్యాలయం ప్రధాన కేంద్రంగా మారనుంది.

# రామగుండం ఎరువుల కేటాయింపుకై కేంద్రంపై ఒతిడి

**మొదటిపేజీ తరువాయి..** నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన రామగుండం ఎరువుల వాటాను సాధించుకునేందుకు మంత్రుల బృందంతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర (మీస్రా) ప్రకటించి కొనుగోళ్ల నుంచి కేంద్రం తప్పుకుంటోందని, ఒక్క మొక్కజొన్న గింజను కూడా కొనుగోలు చేయకపోవడం రాష్ట్ర రైతాంగంపై కేంద్రం చూపిస్తున్న కక్షా సాధింపేనా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో, కేవలం తొలి వర్షాలకే రైతులు విత్తనాలు వేసి నష్టపోవద్దని, కనీసం రెండుసార్లు మంచి వర్షాలు పడితేనే భూమిలో తగినంత పదును వస్తుందని రైతులకు మంత్రి సూచించారు. రైతు సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపేసిన రైతు పథకాలను సైతం తాము పునరుద్ధరిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసిందంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. ఈ పథకానికి సంబంధించి ఎల్ఐసీ (రా×జ) కి చెల్లించాల్సిన వార్షిక ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే పూర్తిగా చెల్లించిందని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు మొత్తం 66,038 మంది మరణించిన రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా రూ.3,301.90 కోట్ల ఆర్థిక సహాయాన్ని నేరుగా నామినీల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.

ఇందులో భాగంగా 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ఆఖరు వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 లో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు అందించామని చెప్పారు. అలాగే 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్రంలో నమోదైన 42.16 లక్షల మంది రైతుల కోసం ప్రభుత్వమే రూ.1,359.56 కోట్ల వార్షిక ప్రీమియం చెల్లించిందని, తద్వారా 20,087 బాధిత కుటుంబాలకు రూ.1004.35 కోట్ల బీమా సాయం అందిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, రాయితీ విత్తనాల సరఫరా వంటి పథకాలను నిలిపివేసి, కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టారని దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, మరణించిన రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్న రైతు బీమా పథకాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక మాఫియా ఘాతుకం: మాజీ పంచాయతీ ప్రెసిడెంట్‌తో పాటు ముగ్గురు సజీవ దహనం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇసుక తవ్వకాల వివాదం తీవ్ర అగ్నికీలలకు దారితీసింది. ఆధిపత్య పోరు మరియు వ్యాపార వైషమ్యాల కారణంగా స్థానిక రాజకీయ నాయకుడు, జన్‌పద్ పంచాయతీ మాజీ అధ్యక్షుడు భరత్ సింగ్‌తో పాటు మరో ఇద్దరిని దుండగులు కారులోనే సజీవ దహనం చేసిన ఘోర ఘటన కొరియా జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘాతుకానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ మీడియా కథనాల ప్రకారం.. భరత్ సింగ్ స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. అయితే, ఇసుక రవాణాకు ఉపయోగించే టిప్పర్ లారీల యజమానులైన మనోజ్ త్రిపాఠీ వర్గానికి, భరత్ సింగ్‌కు మధ్య ఇసుక తరలింపు, రవాణా చార్జీల చెల్లింపుల విషయంలో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడానికి భరత్ సింగ్ తన అనుచరులతో కలిసి నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు.

అక్కడ ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. భరత్ సింగ్ తన ఫార్చూనర్ కారులో తిరిగి వస్తుండగా, త్రిపాఠీ వర్గీయులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. కారు తప్పించుకునే అవకాశం లేకుండా ముందు, వెనుక లారీలను అడ్డంగా పెట్టారు. అనంతరం కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘోర ప్రమాదంలో భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న వీరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**❑ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు పిలుపు**

ఇల్లందు జూన్ 18 (జన సంఘర్షణ)

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ రమేష్ బాబు, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలను స్వహస్తాలతో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల మనుగడ, అభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, స్థానిక ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. పాఠశాలల బలోపేతంలో గ్రామస్తులు చొరవ





చూపాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతే, సమాజంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అనేది అందని ద్రాక్షలా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించే విధంగా ముందుకు రావాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న ఉచిత వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విద్యాసంబంధిత కార్యక్రమంలో స్కూల్ టీచర్ కిరణ్, ప్రీ-ప్రైమరీ టీచర్ సంగీత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ వేడుక

పాల్వంచ జూన్ 18 (జన సంఘర్షణ)

ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ కోనే సూరిబాబు నేతృత్వంలో డబ్లుకేఎఫ్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థుల శారీరక, మానసిక దారుఢ్యానికి ప్రతీకగా నిలిచే ఈ కరాటే పరీక్షల వేడుక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పిఎఫ్ అసిస్టెంట్ కమాండర్ చంద్రశేఖర్, సిఐ కిరణ్ లు హాజరయ్యారు. వారు విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి, వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాలను అభినందించారు. కరాటే శిక్షణలో తదుపరి స్థాయికి అర్హత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అధికారికంగా బెల్ట్ ప్రమోషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ గ్రేడింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జెస్సీ, విద్యార్థి హ్యారీలు ప్రతిష్టాత్మకమైన 'యెల్లో బెల్ట్'ను కైవసం చేసుకున్నారు. అలాగే, కరాటేలో మరిన్ని మెళకువలు ప్రదర్శించి అద్భుత ప్రతిభ చాటిన విద్యార్థిని మనుశ్రీ 'గ్రీన్ బెల్ట్'ను సొంతం చేసుకుని ప్రశంసలు అందుకుంది. ఇదే వేదికపై, రాబోయే అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భాగస్వామ్యం కానున్న దితికా శ్రీకి అకాడమీ తరపున ఘనంగా ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో అకాడమీ సీనియర్ విద్యార్థులు హర్షిక, నీహాశ్రీ, హేమలు పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టి



విశేష సహకారం అందించారు. ఈ వేడుకకు మీడియా పరంగా మరియు నిర్వహణ పరంగా రవికుమార్ అందించిన సహకారం ఎంతో తోడ్పడింది. అకాడమీ విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని అతిథులు ఆకాంక్షించారు.

# 21న ఇల్లందులో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సు

**❑ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్**

ఇల్లందు జూన్ 18 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇంచార్జ్ బాణోత్ హరిప్రియ నాయక్ ఒక ముఖ్య ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్), బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సును నిర్వహించ తలపెట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమం వచ్చే ఆదివారం, అనగా తేదీ 21-06-2026 ఉదయం 09 గంటలకు ఇల్లందు పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలో గల అయిత ఫంక్షన్ హాల్ నందు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, శాసనమండలి సభ్యులు తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, తాతా మధుసూదన్ హాజరుకానున్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షులు రేగా కాంతారావు, ఇల్లందు నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ తదితర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. కావున ఇల్లందు పట్టణంతో పాటు కామేపల్లి, బయ్యారం, టేకులపల్లి, గార్ల, ఇల్లందు మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సభ్యత్వ నమోదు సమన్వయకర్తలు, బూత్ ఇంఛార్జ్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు. యువజన, విద్యార్థి, మహిళా విభాగాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సకాలంలో తరలివచ్చి ఈ అవగాహన సదస్సును పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని బాణోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు.

# ఓటర్ జాబితా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**❑ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అధికారులకు సృష్టించారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)

పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్ ప్రోగ్రాం పై బిఎల్ఓ లకు బిఎల్ఎ లకు బి ఎల్ ఓ సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఎ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా,రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా





చూడాలని, ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి సంబంధిత బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మన అడుగుల కదలికలో....మార్పన్నది తప్పనిసరి!!

సభ్య సమాజంలో...రాజకీయం రాజ్యమేలుతుంది. రాజకీయంగా బలుపు ఉన్నవాడు ఏమిచేసినా... చెల్లిపోతుంది. ఎన్ని అరాచకాలు, ఎన్ని కుట్రలు పన్నినా వారిదే పైచేయి. తర తరాలుగా...రాజకీయ దౌర్జన్యాలు పెట్రేగిపోతూ...కులవ్యవస్థలపై చిన్నచూపు ఏర్పడి కులవివక్షతకు దారి తీసింది. రాజకీయంగా ప్రభుత్వాలను ఏలేవారు రెడ్లు, కమ్మోలేనా...వేరెవరికీ ఆ అర్హత లేదా... కలకాలం వారి మోచేతి క్రింది నీళ్లు త్రాగేటట్లు అనవాయించు కోవడం ఎంతవరకూ సబబూ! జీవితకాలమూ.. ఇలాగే సాగి పోద్ది అనుకుంటున్నారా... ఇదే తీరు మీకు అలవాటు అనుకుంటే, పొరపాటు! తిరుగుబాటు తప్పనిసరి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో..కాంట్యూషన్ ఆఫ్ ఇండియా ఆర్టికల్..19.నిబంధనల అమలు కావడంతో... రాజులు రాజ్యాలేలే రాచరికపు పోకడలు పోయాయి. ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకా లేర్పడ్డాయి న్యాయం, ధర్మం అన్నది జీవిత విధానంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఈ నేపథ్యంలో...సర్వమత సౌంభ్రాంతృత్వం! ఏకత్వంలో..భిన్నత్వం !! భారతదేశ అభిమతం !!!

ఈ రీతిలోనే, ఇప్పటివరకూ ఏమతానికి చెందినవారమైనా సోదరభావంతో...అడుగులు వేస్తూ.. మానవతా దృక్ప ధంతో... అభ్యు దయ భావంతో ముందుకు పోగలు గుతున్నాం! మతాలు వేరైనా... కులాలు వేరైనా... ప్రాంతాలు వేరైనా... మన అభిమతం ఒక్కటే అంటూ... అందరూ కలిసుండి ఎవరికి వారు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉండడం అన్నది గొప్ప విసయం!ఈ విధానం ప్రపంచంలో ఉన్నటువంటి దేశాల్లో ...వేరెక్కడా ...లేదన్నది నిజం!



ప్రజాస్వామ్య విలువలతో ప్రణమిల్లిన దేశం మన భారత దేశం ! ప్రపంచదేశాల్లో... పేరెన్నికగన్న దేశం మన భారతదేశం !! ఇంత పేరు ప్రఖ్యాతలతో

ఆసియా ఖండానికే మకుటంలేని, భారతావని మన దేశం భారత దేశం !!!

ఇంతగా అభివృద్ధి చెందుతున్నా...కూడా మన ఆంధ్రప్రదేశ్‌లో...రాజకీయంగా...

నీచ, నికృష్ట, దౌర్భాగ్యాలు రాజ్యమేలుతున్నాయి అగ్రకులాల ప్రాబల్యం పేట్రేగిపోతోంది.

అనాదిగా... అగ్ర కులాలు మాలా, మాదిగ, వెనుక బడిన కులాలపై ఆధిపత్యం పోరు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అన్నింటిలోనూ...మేమే అధికులమంటూ..రాజకీయ మధ, మాచ్చర్యాలతో దౌర్జన్య కాండలు జరుగుతూనే ఉన్నాయి. నిర్ధాక్షిణ్యంగా.. వూరికి దూరంగా.. అంటరానివారిగా.. అమానుషమైన కక్షపూరితమైన ఆంక్షలు విధించి వెలివేయబడ్డ కులాలెన్నో.... ఇప్పటికీ... కూటికీ, గూడుకీ, గుడ్డకూ నోచుకోని అభాగ్యులెందరో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు అనడంలో అతిశయోక్తి లేదు!

ప్రపంచంలో.. గొప్ప నాగరిక భారతావని అని చెప్పుకోవడం కాదు ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత ఏర్పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లలైనా.... ఇప్పటికీ ఈ దౌర్జన్యఖాండలు విరాజిల్లుతూనే ఉన్నాయి ఈ దుచ్చర్యలకు అంతం లేదా..

గాంధీ పుట్టిన దేశం అని చెప్పుకోడానికే....ఊరు గొప్ప! పేరు దిబ్బ! అన్న సామెత గుర్తుకొస్తుంది. అనాగరికమైన జీవన వైవిధ్యం! సగటు మానవ జాతి దృక్పథానికి నిదర్శనం! ఘీఖరారణ్యంలో... అరణ్యరోధనలతో...వింతైన మానవరూప సమూహాలు మనిషిని మనిషే చీల్చి చెండాడే నరరూప రాక్షసులకు భయంకర పిచాచులకు ఆవాసాలుగా... మారాయి.

కలియుగంలో...కామ, క్రోధాలు, బలవంతుడు బలహీనుడ్ని చీల్చి తినేసే రోజులు ఉత్పన్నం అవుతాయి అన్నది శాస్త్రాలు చెపుతూనే ఉన్నాయి. ప్రస్తుత సమాజంలో.... డబ్బే పరమావధిగా డబ్బున్నవాడే గొప్పవాడుగా చలామణి కాగలుగుతున్నాడు.ఎంతటి మేధస్సున్నా.... ఎందుకూ కొరగాడు! ఈరోజులుల్లో.. డబ్బే ప్రధానం! మంచి,చెడు అన్న తారతమ్యం తెలిసొచ్చే రోజులు ఎప్పుడో పోయాయి. మనిషికి మనిషి పీక్కు తినే రోజులు స్వైరవిహారం చేస్తున్నాయి.ఇది కలియుగం. మనిషిని మనిషిగా చూడలేని నిరంకుశ ధోరణిలతో, సభ్యసమాజం సిగ్గుపడే విధంగా మానవత్వం మంటగలసి పోతుంది. ఎన్నో...అసాంఘీకమైన చిత్ర విచిత్రాలు కళ్ళముందే కదలాడుతుంటే...ఏమను కోవాలి...! దేశ, రాష్ట్రాల దౌర్భాగ్య మనుకోవాలా...!! కనీసం..ఇంగిత జ్ఞానం లేకుండా ఎలా.... భ్రతకగలుగుతున్నారు! ఏమిటీ ఈ... నైరాశ్యం! ఎందుకిలా..జరుగుతుంది. ఈ బ్రతుకుల్లో...ఆశలు ఉదయించే..దెప్పుడు! తనకు తానుగా ఆనందంగా జీవించే..దెప్పుడు! ఆటవిక రాజకీయాలకు స్వస్థి పలికేదెప్పుడు!!

ఆశల నిరాశల నిరాగమ గీతిక! ఆనందాలు వెదజల్లే సరాగాల మాలిక!!

మనిషి పుట్టిక గొప్ప వరమైతే! జీవితం.. దౌర్భాగ్యాల రోదన!! ఊహించని విధి విలాసం!

ఊహకందని హృదయ విలాపం!! అందమైన అనురాగ బంధం! జీవితమే అగమ్య గోచరం!!

సగటు మానవ జీవితం ఓడి దుడుకుల గోల! ఊసురోమంటూ జీవచ్ఛవమై... భయ భ్రాంతుల హేల!! మారుతున్న నాగరిక సమాజంలో...మన అడుగుల కదలికలో మార్పన్నది తప్పనిసరి! జాతి మనుగడకు నీవే దిక్సూచి కాగలగాలి! నీ దృష్టి, నీ ఆశయం నీ హృదయాంతరాల్లో మెదులుతున్న నీకు అనుభవపూర్వకమైన నీ దుర్భర జీవితానికీ, జాతి పరంగా అణగ ద్రొక్కబడిన, దౌర్జన్యఖాండ లకు తిలోదకాలిస్తూ... రాజకీయం అన్నది... ఏవడబ్బ సొత్తు కాదు! నీలో ఓ ప్రజానాయకుడు ఉద్భావించాలి! నీ జాతి ఔనత్యాన్ని కాపాడుకో గలిగినట్టు వాళ్ళముంగిటకు తీసుకుపోగలిగినట్లయితే నీ జాతికి నీవే నాయకుడివి. నీ కుల యావత్తుని రాజకీయ చైతన్యవంతులుగా మలచ గలిగే ఓర్పు,నేర్పు నీలో ఉన్ననాడు ఎవడో..మోచేతి నీళ్లు త్రాగడానికి ఉబలాటమెందుకు! మనం అనుకుంటే, సాధించి తీరగలం మన ఆశయం గొప్పది కావాలి! మన ప్రత్యర్థిని ఎదుర్కో నేందుకు శక్తులన్నింటినీ కూడగట్టుకోవాలి! మనకున్న దారులన్నింటినీ దిగ్బంధన చేయాలి! వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలి! ఎత్తుకు పైఎత్తు వేయాలి! రాజకీయ సమీకరణలు చేయాలి! ప్రత్యర్థులను ఎప్పుడూ తక్కు వంచనా... వేయకూడదు! అనుక్షణం నా అనుకున్న వాళ్లతో.. మమేకం కావాలి! వీటన్నింటిపై దృష్టి పెట్టగలి గిననాడు నీ కులపరంగా నీవే నాయకుడివి కావడం నీవు అనుకున్న పదవి యోగం నిన్ను వరిస్తుంది. సాధన చేస్తే... సాధించలేనిదంటూ... ఏమీలేదు! ఇది నిజం! జీవిత సత్యం!! రానున్న రోజుల్లో... రాజకీయాలకు ఊతమిచ్చి పల్లెల్లో...గ్రామాల్లో... పట్టణాల్లో...జిల్లాల్లో... రాష్ట్రాల్లో...రాజకీయ ఉద్యమ నాయకుడిగా రాజకీయ చతురతతో తిరుగులేని స్వచమైన ప్రజా స్వామ్య ప్రతినిధిగా వెలుగొంది! ప్రజా సంక్షేమంలో... నిస్టాతుడివై, నిన్ను నమ్ముకున్న ప్రజల్లో వెలుగు నింపే... అధినాయకుడివై వర్ధిల్లు గాక! అందరి పుట్టిక ఒకటే అందరి రక్తం ఒకటే అందరూ పీల్చే గాలి ఒకటే పేదా, గొప్పా తక్కువా, ఎక్కువా..అని ఎవరు చెప్పారు! ఎందుకీ తర, తమ భేదాలు! మనిషిని, మనిషిగా చూసే మానవతా దృక్పథం కలిగే సభ్య సమాజం ఏర్పడాలి! సమ సమాజ సంస్కృతికి, స్వచ్ఛమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కొరకు "యువతరం" పునాదు వేయగలగాలి! కులాల కలగలుపుతో...రాజకీయ ప్రక్షాళన చేయాలి! కులాల వివక్షతను పారద్రోలాలీ! అంటరాని తనాన్ని నిర్మూలించాలి! భారత సంస్కృతికి ప్రతీ ఒక్కరూ.... పునఃరంకిత మవ్వాలి!!

సర్వేజన సుఖినో..భవంతు!

**రచన:**
**మైలపల్లి మమతా నాగరాజు**
**99668 76796**
**యల్ ఐ జి - సి /529, సాగర్ నగర్, విశాఖపట్నం జిల్లా**
**530 045. ఆంధ్రప్రదేశ్.**

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శుక్రవారం 19 జూన్ 2026


# పినపాక ఉపాధి హామీలో 'డిజిటల్' మాయాజాలం

- ప్రశ్నించిన జర్నలిస్టులపై ఏపీవో వీరభద్ర స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు
- "మీకు డబ్బు కావాలా..?": అవినీతిని నిలదీసిన మీడియాపై పినపాక ఏపీవో నోటిదూల
- ఏపీవో నిర్లక్ష్యంపై జిల్లా స్థాయి విచారణకు ఆదేశం
- సమాధానం చెప్పాల్సింది పోయి.. సత్యం రాసిన కలంపై నిందలా?: ఏపీవో వ్యాఖ్యలపై జర్నలిస్టుల ఆగ్రహం
- పోట్లపల్లి ఉపాధి పనుల్లో అక్రమాల గుట్టురట్టు.. తప్పు కప్పిపుచ్చుకునేందుకు అధికారుల తంటాలు
- మీడియాపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు: చర్యలు తప్పవని హెచ్చరించిన పినపాక ఎంపీడీవో
- కేవైసీ ఫోటోల వెనుక పెద్ద స్కామ్?: పినపాక ఏపీవో వాదనలను పటాపంచలు చేసిన జిల్లా విచారణ

పినపాక జూన్ 18 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో ఉపాధి హామీ పథకం అమలులో భారీ అవకతవకలు చోటుచేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలు ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారాయి. నిరుపేదలకు కూలి కల్పించాల్సిన పథకంలో సాంకేతికతను అడ్డుపెట్టుకుని అక్రమాలకు తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని పోట్లపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో క్షేత్రస్థాయిలో కూలీలు రాకపోయినప్పటికీ, వారికి 'డిజిటల్ నకిలీ హాజరు' నమోదు చేస్తున్నట్లు ఆధారాలతో సహా ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ డిజిటల్ అక్రమాల వ్యవహారం జిల్లా స్థాయిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ అక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, క్షేత్రస్థాయి వాస్తవాలను సేకరించిన ఒక ప్రముఖ దినపత్రిక, ప్రజా ప్రయోజనాలను ఆశించి సమగ్రమైన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు తక్షణమే స్పందించారు. పత్రికా కథనం ఆధారంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయి అధికారులు రంగంలోకి దిగడంతో ఈ డిజిటల్ హాజరు వెనుక ఉన్న అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ అవకతవకలపై ప్రాథమిక దశలోనే వివరణ కోరేందుకు ఒక జర్నలిస్ట్ పినపాక మండల ఉపాధి ఏపీవో వీరభద్ర స్వామిని సంప్రదించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతూ సమాధానం చెప్పాల్సిందిగా కోరారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఏపీవో వీరభద్ర స్వామి, జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి, అత్యంత అహంకారపూరితంగా వ్యవహరించారు. "మీరు డబ్బు కోసమే వార్తలు రాస్తున్నారు.. మీకు డబ్బు కావాలా?" అంటూ జర్నలిస్టులను కించపరిచేలా






మాట్లాడారు. ప్రజా సమస్యలను, ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని వెలుగులోకి తెస్తున్న మీడియా ప్రతినిధులపై ఏపీవో చేసిన ఈ వ్యాఖ్యలు పత్రికా రంగంలో తీవ్ర కలకలం రేపాయి. నిజాన్ని నిలదీస్తే జర్నలిస్టుల వ్యక్తిత్వాన్ని హననం చేస్తారా అంటూ జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. అంతకుముందు కూడా డిజిటల్ హాజరులో జరుగుతున్న అక్రమాలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వాటిని పూర్తిగా కొట్టిపారేశారు. "మీరు పంపించిన సమాచారం తప్పుడు సమాచారం, కేవైసీ విధానంలో ఫోటోలు తీసుకుంటాం కాబట్టి ఎలాంటి అవకతవకలు జరగడానికి అవకాశమే లేదు" అంటూ అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఏపీవో అంతలా బుకాయించినప్పటికీ, జిల్లా స్థాయి అధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి విచారణకు ఆదేశించడంతో క్షేత్రస్థాయిలో అక్రమాలు జరిగింది వాస్తవమేనని నమ్ముతున్నారు. ప్రారంభ దశలో వచ్చిన ఫిర్యాదులను ఏపీవో నిర్లక్ష్యం చేసిన తీరు ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. కోట్ల రూపాయల ప్రజాధనంతో పేదల కోసం అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు భంగం కలిగించేలా కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. తప్పులను సరిదిద్దాల్సింది పోయి, ప్రశ్నించిన మీడియా ప్రతినిధులను అవమానించడం ఏంటని స్థానిక ప్రజలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు. నిజాలను నొక్కిచెప్పే జర్నలిస్టులపై తప్పుడు ముద్ర వేయడం ద్వారా అవినీతిని దాచలేరని వారు హితవు పలుకుతున్నారు. ఈ ఉపాధి హామీ డిజిటల్ హాజరు అక్రమాలపై, అలాగే మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీవోపై జిల్లా కలెక్టర్ స్వయంగా దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక ఉన్నత స్థాయి కమిటీతో పారదర్శక విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ వివాదంపై పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జర్నలిస్టులు వివరణ కోరారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అక్రమాలను ఎండగడుతున్న జర్నలిస్టులపై ఏపీవో తప్పుడు ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సరికాదని ఎంపీడీవో స్పష్టం చేశారు. జర్నలిస్టులను అవమానించేలా మాట్లాడిన ఏపీవో వీరభద్ర స్వామి వ్యవహారాన్ని, అలాగే డిజిటల్ హాజరు అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. బాధ్యులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకునేలా నివేదిక సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

- మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్.
- యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు.
- ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్,మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదు.
- ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం.
- రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.
- పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)

రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో



ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చన్నారు. యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు సమన్వయం పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

# హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం

- బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లాలోని బీసీ,ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార మెనూలో ఎలాంటి తేడాలు ఉండకూడదని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, మెనూ అమలులో నిర్లక్ష్యం లేదా వ్యత్యాసాలు కనిపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత వార్డెన్లదేనని పేర్కొన్నారు.అలాగే విద్యార్థులకు అవసరమైన కాస్మెటిక్ వస్తువులు, దినసరి అవసరాల సామగ్రి,ఆహార భద్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లకు సూచించినట్లు తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యా పురోగతికి ప్రాధాన్యత ఇవ్వాలని, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, వార్డెన్లు సమన్వయంతో పనిచేయాలని ఉపేందర్ సూచించారు.

# జక్కన్నపేట గ్రామంలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ, ఉపసర్పంచ్ శీల కనకమ్మ-ముత్యాలు, పంచాయతీ సెక్రెటరీ, వార్డు సభ్యులు బాయికాడి రాజు, కోరబోయిన వసంత శివకుమార్, మామిండ్ల నర్సింలు, గంట నాగమణి-నర్సింలు, గ్రామ పెద్దలు మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొని మొక్కలు నాటారు.

# సీఎస్పీ బస్తీలో వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీలో నూతన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో పండుగ వాతావరణం నడుమ ఎమ్మెల్యేకి స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రతిష్టించిన నాభిశిల, ముత్యాలమ్మ తల్లి అమ్మవార్ల విగ్రహాలకు ఎమ్మెల్యే కోరం కనకయ్యప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, బొడ్రాయి ప్రతిష్ఠాపనతో గ్రామానికి అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే వెంట ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల పార్టీ అధ్యక్షులు మండల రాంమహేష్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాయం స్రవంతి కృష్ణ ప్రసాద్, బొజ్జాయిగూడెం ఉపసర్పంచ్ అరెం కిరణ్, ప్రముఖ నాయకులు ప్రసన్న కుమార్, దండుగుల శివ, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని ఈ ప్రతిష్ట మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలోని ఎంపీపీఎస్ భిక్య తండా గ్రామంలో

- సామూహిక అక్షరభాసం కార్యక్రమం
- డైరీల ఆవిష్కరణ
- పిల్లలకు పుస్తకాల పంపిణీ



ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, ప్రధాన ఉపాధ్యురాలు వనజ, ఉపాధ్యురాలు శోభారాణి, వార్డు సభ్యులు వాంకుడోత్ రమేష్, మాలోత్ విజయ, అజ్మీరా మమత, అంగన్వాడీ టీచర్ రాజమణి , అజ్మీరా సురేష్, రమేష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా ఇవ్వబడుతుంది అని చెప్పటం జరిగింది.

# బాధ్యత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- కాంగ్రెస్ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18: (జన సంఘర్షణ):



మెదక్ జిల్లా రామాయంపేట మండలంతోని గండ్ల గ్రామానికి చెందిన రమేష్ ఇంటి రేకులు గత కొద్ది రోజుల క్రితం వర్షంతో పాటు భారీ ఇదురు గాలి రావడంతో ఎగిరిపోవడం జరిగింది. ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా ఆయన తోనిగండ్ల ఊరికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి నాగులు, ఉపసర్పంచ్ దుర్గయ్య, శంకర్, ప్రశాంత్, హరీష్, విక్రమ్, మహేష్, తిరుమలయ్య, వీరయ్య, మల్లేశం, సురేష్, బాలకృష్ణ, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు..

- పారదర్శక బదిలీలతో పోలీసు సిబ్బందికి భరోసా.
- సీనియారిటీకి ప్రాధాన్యమిస్తూ బదిలీలు.
- కౌన్సిలింగ్ ద్వారా 80 మంది కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 80 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు. ప్రతి కానిస్టేబుల్‌తో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు, పిల్లల విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పారదర్శకమైన బదిలీల విధానం సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన కానిస్టేబుళ్లు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, సూపరింటెండెంట్ వల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 5 గంటల నుంచే బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు దుర్మార్గమైన చర్య

- ప్రతిపక్షాలపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి.
- లాఠీలు, తూటాలు, అరెస్టులకు భయపడేది కాదు బీఆర్ఎస్ పార్టీ.
- పట్టణ పార్టీ కన్వీనర్,కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)




మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తెల్లవారుజామున 5 గంటల నుంచే ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు విమర్శించారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి కారణం చెప్పకుండా ఉదయం నుంచే పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అనంతరం సీఎం నివాసం ముట్టడి చేసే అవకాశముందని భావించి ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అరెస్టులు కొత్త కాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో అరెస్టులు, లాఠీచార్జీలు, కేసులు, తూటాలను ఎదుర్కొంటూ ప్రజల కోసం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. లాఠీలు, తూటాలు, అరెస్టులకు తమ పార్టీ నాయకులు భయపడరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులపై దృష్టి సారించడం సరికాదని విమర్శించారు. అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేయలేరని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు ప్రజల పక్షాన పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీద.కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకులు ప్రభు రెడ్డి, ఇందాద్ సాయి తదితరులు ఉన్నారు.

## పేద ప్రజల సొంతింటి కల నెరవేరిన సందర్భం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)



మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు పార్టీలకు అతితంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి,రామయంపేట మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డులో ఊర చిన్నా స్వామిఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరైన 7వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు, పట్టణ అధ్యక్షులు చింతల స్వప్న స్వామి. ఈ కార్యక్రమంలో డి సి సి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి, కార్యదర్శి పోచమ్మల గణేష్ ,మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, కాంగ్రెస్ నాయకుడు తోంటవల్లి యాదగిరి,ఎర్రం సత్యం,సాదుల పరశురాముల, పచ్చుంటి రాము, బైరం శంకర్, బోట్ల బాబు, శివ కుమార్ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, సుదీర్ గౌడ్,గణేష్, సాయి,తదితరులు పాల్గొనడం జరిగింది.

## మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ ఆధ్వర్యంలో మార్కెట్ ఆకస్మికంగా తనిఖీ

- తై బజార్ ఫీజు వసూలు చేసే ప్రక్రియను పర్యవేక్షించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18: (జన సంఘర్షణ)



18.06.2026 నాడు మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ ఆకస్మికంగా మార్కెట్‌ను సందర్శించి అక్కడ మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా తైబజర్ ఫీజు వసూలు చేయు ప్రక్రియను పర్యవేక్షిoచినారు. చిరు వ్యాపారులైన కూరగాయల అమ్మకం దారులతో చర్చించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా, మార్కెట్లోని మటన్ మార్కెట్, బీఫ్ మార్కెట్ ఫిష్ మార్కెట్ లను కూడా సందర్శించగా బీఫ్ మార్కెట్ లో గల వాటర్ కనెక్షన్ నుండి ఒక పైప్ లైన్ వేయించి మటన్ మార్కెట్లో కూడా వాటర్ ట్యాప్ బిగించుటకు మటన్ అమ్మకం దారులు కమిషనర్‌ని కోరినారు. మార్కెట్ పరిసర ప్రాంతాలలో గల దుకాణంల యజమానులకు మున్సిపాలిటీ నుండి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచనలు జారీ చేయడం జరిగింది. అంతేకాకుండా, పట్టణంలోని డంపింగ్ యార్డ్‌లో గల డిఆర్‌సిసి ను వర్మి కంపోస్ట్ షెడ్ లను సందర్శించి వర్మీ కంపోస్ట్ షెడ్‌లో తడి చెత్త ద్వారా చేపడుతున్న ఎరువు తయారి విధానాన్ని గమనించి సిబ్బందికి దిశా నిర్దేశం చేసినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ ఇంజనీర్, రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

# భద్రాచలం ఆసుపత్రి వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం

- 'జన సంఘర్షణ' వరుస కథనాలకు అధికారుల సానుకూల స్పందన
- రోగులతో దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు: భద్రాచలం ఏరియా ఆసుపత్రి లోపాలపై డీసీహెచ్ఎస్ క్లారిటీ
- ఏరియా ఆసుపత్రి లోపాలపై కలెక్టర్ నిరంతర పర్యవేక్షణకు ఆదేశం
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- గతంలో శవాన్ని మోసుకెళ్లిన దుస్థితి, నేడు ప్రాణాల మీదకు తెచ్చిన నిర్లక్ష్యం.. గిరిజనుల పెద్ద దిక్కుకు ఏమైంది?







భద్రాచలం జూన్ 18 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది యొక్క నిర్లక్ష్య వైఖరి మరోసారి బట్టబయలైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు, ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే ఆర్థిక స్తోమత లేని గిరిజనులకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో మానవత్వం మంటగలిసింది. ప్రాణ ప్రాయ స్థితి లో ఉన్న రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై స్థానికంగా తీవ్ర ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమిశెట్టి రత్నకుమారి (31) అనే మహిళ కొన్ని కారణాల వల్ల నిద్రమాత్రలు మింగగా, ఆమె భర్త జగదీష్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను కాపాడుకునేందుకు హుటాహుటిన భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. తన భార్య పరిస్థితి విషమంగా ఉందని, దయచేసి త్వరగా చికిత్స అందించాలని భర్త జగదీష్ అక్కడి సిబ్బందిని, వైద్యులను ఎంతో బతిమిలాడారు. అయితే, అక్కడ ఉన్న వైద్యులు, నర్సులు అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ వేరే ఎమర్జెన్సీ కేసులు ఉన్నాయని, తాము రౌండ్స్‌కు వెళ్తున్నామంటూ కాలయాపన చేశారు. నిద్రమాత్రలు మింగినప్పుడు తక్షణమే చేయాల్సిన అత్యవసర ప్రాథమిక చికిత్సలైన వాంతులు చేయించడం కానీ, కడుపును (స్టమక్ వాష్) శుభ్రం చేయడం కానీ కనీసం చేయకుండా వైద్యులు చేతులు దులుపుకున్నారు. కేవలం ఒక గ్లూకోజ్ బాటిల్ పెట్టి ఆమెను పట్టించుకోవడం మానేశారు. రోగి చావుబతుకుల్లో ఉంటే కనీస బాధ్యత లేకుండా వైద్యులు, నర్సులు ఒకరినొకరు జోకులు వేసుకుంటూ, నవ్వుకుంటూ గడపడం అక్కడి వారిని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. గతంలో శవాన్ని ముగ్గురు వ్యక్తులు చేతులపై మోసుకెళ్లిన దుస్థితిని గుర్తుచేస్తూ, ఆసుపత్రిలో మళ్లీ ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కావడంపై ప్రజలు మండిపడుతున్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న ఈ ఘోర కలిని, వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని 'జన సంఘర్షణ' దినపత్రిక ప్రముఖంగా వెలుగులోకి తెచ్చింది. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆసుపత్రి తీరుపై 'జన సంఘర్షణ' పత్రిక వరుస కథనాలను ప్రచురించి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా 'జన సంఘర్షణ' రాసిన ఈ వరుస కథనాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించడమే కాకుండా ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక తెచ్చాయి. 'జన సంఘర్షణ' పత్రికా కథనాలకు జిల్లా అధికారులు తక్షణమే స్పందించారు. ఆసుపత్రిలో నెలకొన్న లోపాలపై గురువారం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ రవిబాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇకపై భద్రాచలం ఏరియా ఆసుపత్రి పనితీరుపై జిల్లా కలెక్టర్ ప్రతిరోజు స్వయంగా పర్యవేక్షిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా, అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులతో దురుసుగా ప్రవర్తించినా బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని రవిబాబు తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రి వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నూతన సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఆర్ఎంఓ తదితరులు పాల్గొని ఆసుపత్రి సేవల మెరుగుదలకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు.

## ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు

బీబీపేట్, జూన్ 18 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బిబిపేటలో మండల అధ్యక్షుడు పాత రాజు ఆధ్వర్యంలో ఇంద్రమ్మ ఇల్లుకు ముగ్గు వేయడం జరిగింది. గత కొన్ని సంవత్సరాల నుండి ఇల్లు కోసం చాలా ఇబ్బందులు పడ్డాము. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చాక మాకు ఇంద్రమ్మ ఇల్లు రావడం చాలా సంతోషకరంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను అని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు వక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ సాత్విక, ఉపసర్పంచ్ చందుపట్ల ప్రశాంత్, వార్డు మెంబర్ మల్లుగారి రోజా, మాజీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్, జిల్లా నాయకులు మహమ్మద్ సలీం, మండల యువజన అధ్యక్షుడు మల్లుగారి మహేష్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ అరుణ్ శర్మ, మ్యాదరి సృజన, స్వామి, ప్రవీణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి

కామారెడ్డి బీబీపేట్ జూన్ 18 ( జన సంఘర్షణ )



బీబీపేట్ మండలంలోని ఫర్టిలైజర్ షాపులను గురువారం మండల వ్యవసాయ అధికారి నరేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు షాపులలో స్టాక్ రిజిస్టర్స్ , బిల్లు పుస్తకాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు దుకాణదారులు ఖచ్చితమైన బిల్లులు అందించాలని, దుకాణం గోదాం వద్ద సరియైన చిరునామాతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరైన ధరకు విక్రయించాలని నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలి

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.
- భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి కలెక్టర్ ప్రతి మాసింగ్.
- ఘనంగా ప్రారంభం అయిన వన మహోత్సవం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా రామాయణపేట మండలం అక్కన్నపేట మన యోజన పార్క్ ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. గురువారం జిల్లాలోని రామాయంపేట మండలం అక్కన్నపేట వన యోజన పార్కు అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్, డిఎఫ్ఓ జో.జి ,డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాసిల్దార్ రజిని కుమారి, ఎంపీడీవో సజ్లోద్దీన్, సర్పంచ్ యాదగిరి, లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ మాధవని రఘునందన్ రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అక్కన్నపేట పార్కుకు రెండు కోట్లు మంజూరుచేసిందన్నారు. ఇప్పటి వరకూ కోటి నలభై లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నేడు ప్రారంభించనున్న 11 పార్కులకు 22 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. వనాలను రక్షించాలన్నారు.



మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. 765 డీజి రోడ్డులో మొదటి దశలో 20 వేల మొక్కలు నాటేందుకు జూలైలో ప్రణాళిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ..భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అంతకుముందు అక్కన్నపేట వన యోజన వన యోజన పార్కును ప్రారంభించిన అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించి మెదక్ ఎంపీతో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
శుక్రవారం
19 జూన్ 2026

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్.




హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 18, (జన సంఘర్షణ):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం మదీనాగూడ డివిజన్ పరిధిలోని గంగారాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తున్న పాఠ్య పుస్తకాలు,నూతన స్కూల్ యూనిఫామ్ లు డివిజన్, స్థానిక నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన,ఆధునిక తరగతి గదుల నిర్మాణం,డిజిటల్ విద్యా వనరుల అందుబాటు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా పలు సంస్కరణలు చేపడుతోందని అన్నారు. బలమైన ప్రభుత్వ పాఠశాలలు – బంగారు తెలంగాణకు పునాది అనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే సమాన అవకాశాలతో కూడిన సమాజ నిర్మాణానికి తొలి అడుగు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్, శేఖర్ ముదిరాజ్,పరదాల ప్రధాన ఉపాధ్యాయులు సుభాష్, యూసుఫ్, చిన్న, దేవరాజ్, ఇస్మాయిల్, యాదయ్య, అనిల్ కుమార్, శంకర్, అంజయ్య, భిక్షపతి, కోటప్ప, లక్ష్మణ్, సుధాకర్, నందూ, దొంతి రాజు, వల్లి, దొంతి శ్రీను, దేవానంద్, వీరేందర్, కంది పెంటయ్య, హనీఫ్, మహిళలు భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యా అవకాశాలపై చర్చ

- చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక సమావేశం
- చిచెస్టర్ యూనివర్సిటీలో కోచులకు ఇచ్చే శిక్షణ, క్రీడాకారులకు నైపుణ్యతపై అవగాహన, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలపై మంత్రి వాకిటి శ్రీహరితో చర్చించారు.



హైదరాబాద్,/ జూన్ 18: /(జన సంఘర్షణ)
తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్టాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం, చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి విద్యను అందిపుచ్చుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో పోటీపడేలా భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు తమ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల గురించి వివరించారు. తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య, గ్లోబల్ ఎక్స్‌పోజర్ కల్పించేందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధి ఒలివియా మెక్‌లాగ్లిన్, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్లేష్ ముదిరాజ్ నూతన గృహప్రవేశం పూజా కార్యక్రమం

- పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, బేరి రామచందర్ యాదవ్.

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 18, (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల నేతాజీ నగర్ కాలనీలో నివాసం ఉండే మల్లేష్ ముదిరాజ్ సాయి ముదిరాజ్ కుటుంబ సభ్యులు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి.జగదీశ్వర్ గౌడ్, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పరిగి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే బేరి రామచంద్ర యాదవ్ సత్యనారాయణ స్వామి పూజ కార్యక్రమం పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని భగవంతుని వేడుకున్నారు కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, గంగమ్మ, పద్మమ్మ, షకీల్, గోపాల్ మేస్త్రి, అంకంరావు మేస్త్రి, కాలనీ పెద్దలు మహిళా సోదరులు యువజన నాయకులు మల్లేష్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## బాధిత కుటుంబ సభ్యునికి రూ.75000 విలువ గల ఎల్.ఓ.సి అందించిన ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి..



హనుమకొండ/జూన్ 18/(జన సంఘర్షణ)
ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంటే పెద్దపురంకి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మోకాలు చికిత్స వైద్యం కోసం వెళ్లగా పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందని పరిస్థితిని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 75000/-( డెబ్బై ఐదు వేలు) రూపాయల విలువగల ఎల్.ఓ.సి మంజూరు చేపించి ఈ రోజు ఎల్.ఓ.సి పత్రాన్ని హనుమకొండ లోని ఎం.ఎల్.ఏ కడియం శ్రీహరి నివాసంలో వారి కుటుంబ సభ్యులకు అందించారు.

## ముత్తూట్ ఫైనాన్స్ నూతన శాఖను ప్రారంభం

- ఎస్సై రమాదేవితో కలిసి ప్రారంభించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



సుజాతనగర్/జూన్ 18/(జన సంఘర్షణ)
సుజాతనగర్ ( ) కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి సుజాతనగర్ లోని కాంప్లెక్స్ నందు ఏర్పాటు చేసిన ముత్తూట్ ఫైనాన్స్ నూతన శాఖను స్థానిక ఎస్సై మాలోత్ రమాదేవి తో కలిసి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముందుగా సంస్థ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఆర్థిక సేవలను మరింత చేరువ చేసే విధంగా ముత్తూట్ ఫైనాన్స్ సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపార, ఆర్థిక రంగాల అభివృద్ధికి ఇటువంటి సంస్థలు దోహదపడతాయని, కొత్త శాఖ ద్వారా ప్రజలకు రుణాలు, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయాలు, ఇతర ఆర్థిక సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- పోక్సో కోర్టు

రాజోలి శాంతినగర్: /జూన్ 18/(జన సంఘర్షణ)



బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై 2023 జనవరి 30న నిందితుడు కమ్మరి పెద్ద చిన్నయ్య అలియాస్ చిన్నయ్య మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ తరుణంలో బాధితురాలి తండ్రి రాజోలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ హెచ్ వో శ్రీనివాసులు క్రైమ్ నెం. 11/2023గా కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐశివశంకర్, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు పంపడంతో పాటు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు.

**ప్రజా గుండెల్లో చిరస్థాయిగా నిలిచే లీడర్ నరేష్ రెడ్డి....**

విచారణ సమయంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మొగిలయ్య పర్యవేక్షణలో శాంతినగర్ సీఐ శంకర్, రాజోలి ఎస్సై గోకారి, భరోసా కేంద్రం బృందం సాక్షులను సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెట్టి కేసు బలపరిచారు. విచారణ అనంతరం గద్వాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి-కమ్-పోక్సో కోర్టు జడ్జి వి. శ్రీనివాస్.. నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఐఓలు శ్రీనివాసులు, శివశంకర్, ప్రస్తుత గద్వాల డీఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ శంకర్, రాజోలి ఎస్సై గోకారి, అదనపు పీపీ కె. విజయ్ కుమార్, భరోసా కేంద్రం బృందం, కోర్టు డ్యూటీ అధికారులు జిక్కి బాబు, సాయిబాబా, రామచంద్రుడులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అభినందించారు.

## సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

- గస్తీ, నాకాబందీలతో నేర నియంత్రణకు చర్యలు.
- స్టేషన్ తనిఖీలో పెండింగ్ కేసులపై ఆరా.
- రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 (జన సంఘర్షణ)



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు గస్తీ, నాకాబందీలను మరింత ముమ్మరం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ,తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న కేసులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ-సాక్ష్య యాప్ ద్వారా సంఘటన స్థలంలోని డిజిటల్ ఆధారాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, కేసుల వివరాలను సి సి టి ఎన్ ఎస్ లో సకాలంలో నమోదు చేసి నవీకరించాలని అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, రాత్రి గస్తీలు,వాహనాల తనిఖీలు, నాకాబందీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలన్నారమోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐలు సైదా,సందీప్ రెడ్డి, ఎస్ ఐ బాలరాజు ఉన్నారు.

## చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు శ్రీరంగం ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహకార చేయూత

- వ్యక్తిగత విజయంతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే పౌరులుగా పిల్లలు ఎదగాలి.
- శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం.


హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 18, (జన సంఘర్షణ):




నేటి సమాజంలో పాశ్చాత్య దేశాల సంప్రదాయాల వైపు చూస్తున్న వేళ, చిన్నారులకు ఆధ్యాత్మికతవైపు అడుగులు వేసేలా ప్రయత్నం చేస్తున్న జంగాల రాజేష్ నవ్య దంపతుల కుమార్తె శాస్త్ర మహీ చిన్న వయసు నుండే భక్తి మార్గంలోకి వెళు తున్నచిన్నారికి అందరూ అభినందనలు తెలుపుతున్నారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను కనబరిచిన నాలుగేళ్ల బాలిక అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇటీవల ఆన్లైన్లో హనుమాన్ చాలీసా పోటీ పెట్టగా హనుమంతుడిపై అపార భక్తిని చాటుతూ కేవలం నాలుగు నిమిషాలలోనే చాలీసాను ఎలాంటి తడబాటు లేకుండా పూర్తి హనుమాన్ చాలీసాను అనర్గళంగా పారాయణం చేసి ప్రశంసలు అందుకుంది. వివిధ రంగాలలో చదువులో, ఆటల్లో, నాట్యంలో ప్రావిణ్యం పొందిన చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు శ్రీరంగం ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహకార చేయూత నగదు రూపంలో మాదాపూర్ లోని కార్యాలయంలో శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఇందుమతి శ్రీరంగం మాట్లాడుతూ.. చదువుతో పాటు పిల్లలలోని సహజ ప్రతిభను వెలికితీయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని అన్నారు. కష్టపడితే ఏదైనా సాధ్యమని, విజయానికి పట్టుదలే పునాది అని, పిల్లలు సమాజంలో ఎంత ఎదిగితే అంత తల్లితండ్రులు సంతోషిస్తారని పిల్లలు కూడా సమాజంలో గౌరవం పొందుతారని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని చిన్నారి శాస్త్ర మహీని స్వయంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో మృతదేహం లభ్యం

నవీపేట్ మండలం/జూన్ 18/(జన సంఘర్షణ)



నవీపేట్ మండలం నాగేపూర్ శివారులోని చెరువులో ఓ వ్యక్తి మృతదేహం స్థానికంగా కలకలం రేపింది. చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి గుర్తింపు, మరణానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేసిన డాక్టర్ హకీమ్

- విద్యార్థుల కోసం కుర్చీలు, బెంచీలు, ప్లేట్లు ఇస్తానని హామీ ఇచ్చిన హకీమ్
- దేవుడు ఎందరికో ఎంతో ఇస్తాడు కానీ పంచే గుణం దైవగుణం ఒక్కరికే ఉంటుంది ఆయననే ఎంఏ అకీమ్
- సామాజిక సేవకర్త ప్రజా నాయకులు ప్రజల నాయకుడు ఏకైక వ్యక్తి,
- గుడి, మసీదు వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచిన హకీమ్






కోటగిరి,జూన్ 18/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని దోమలెడ్డి గ్రామంలో బుధవారం జల్లాపల్లి గ్రా మానికి చెందిన సామాజిక సేవకర్త డాక్టర్ ఎంఏ హకీమ్ ఆధ్వర్యంలో 70 మంది ప్రభుత్వ పాఠశా లలో చదువుతున్నవిద్యార్థులకు పెన్నులు, పెన్సి ల్స్‌తో పాటు నోట్ బుక్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెండు మూడు రోజుల్లో పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు కుర్చీలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు బెంచీలు కావాలని అడగగా జులై చివరి వరకు ఇస్తానని అన్నారు. అలాగే గ్రామస్తులు మజీద్ వద్ద పాఠశాలలో ఒకటి సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని కోరడంతో వారికి సైతం త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవాకర్త డాక్టర్ ఎం .ఏ హకీమ్ మాట్లాడుతూ... బడి గుడి చాలా పవిత్రమైనదని ఈ గుడి బడి వద్ద శుభ్రంగా ఉం చుకోవాలని అన్నారు. దోమలెడ్డి గ్రామస్తులు తన వంతు సాయంగా పాఠశాల విద్యార్థులకు చేయాలని అడగగానే వెంటనే స్పందించి వి ద్యార్థులకు పెన్ను పెన్సిల్ తో పాటు నోట్బుక్లను పంపిణీ చేయడం జరిగింది



అన్నారు. అలాగే త్వ రలోనే పాఠశాలలో ప్లేట్ల తో పాటు పది కుర్చీలు పంపిణీ చేస్తానని అన్నారు. గ్రామస్తులు అడిగిన విధంగా బడి వద్ద గుడి వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కా ర్యక్రమంలో పొతంగల్ మండల టబీఆర్ఎస్ నాయకులు సూదం నవీన్, పాఠశాల ఉపాధ్యా యులు ప్రభాకర్, వరలక్ష్మి. అజయ్,గ్రామస్తులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకినిలో నూతన బీరప్ప దేవాలయం ప్రారంభం





- పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొనడం విశేషం

నిజామాబాద్ జిల్లా /పోతంగల్, జూన్ 18

జిల్లా పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సు-వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ప్రారంభో త్సవాన్ని నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యా-త్మిక కేంద్రాల అభివృద్ధికి కూడా ప్రజలంతా సహకరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో దేవాలయాలు సామాజిక ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు, సుంకిని గ్రామ సర్పంచ్ షాజీ పటేల్, మండల అధ్యక్షుడు పుప్పల శంకర్,సాఎషి చైర్మన్ హనుమంత్ , మల్లు గొండ, మాధవ్ పటేల్, హనుమంత్ పటేల్, మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్, కోటగిరి మైనార్టీ లీడర్ జుబేర్, బాబు ఖాన్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాలూర: 11 రోజుల పసికందుతో పరీక్షా కేంద్రానికి


బోధన్/జూన్ 18/(జన సంఘర్షణ)



ఉపాధ్యాయురాలు కావాలనే సంకల్పం ముందు మమకారం తలవంచింది. సాలూర మండలానికి చెందిన ఓ అభ్యర్థిని 11 రోజుల పసికందుతో టీజీ టెట్ పరీక్షా కేంద్రానికి చేరుకుంది. ఆ బిడ్డను బయట తన భర్తకు అప్పగించి, పరీక్ష రాసేందుకు ఆమె లోపలికి వెళ్లారు. పసిబిడ్డను వదలలేక, భవిష్యత్తు కోసం పరీక్ష రాయక తప్పని ఆ తల్లి ఆరాటం చూసి పరీక్షా కేంద్రం సిబ్బంది, తోటి అభ్యర్థులు చలించిపోయారు.

## అత్యంత క్రూరం.. వివాహితపై గ్యాంగ్ రేప్, ప్రైవేట్ పార్ట్ బుల్లెట్!

బిహార్/జూన్ 18/(జన సంఘర్షణ)



బిహార్లోని బేగుసరాయ్ జరిగిన అత్యంత దారుణ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జూన్ 11న ఐదుగురు దుండగులు ఓ వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. భర్తను ఓ గదిలో కట్టేసి తనను గ్యాంగ్ రేప్ చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తీవ్రమైన కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరగా డాక్టర్లు షాక్ అయ్యారు. బాధితురాలి మర్మాంగం నుంచి బుల్లెట్, రాయి, చెక్కముక్కను బయటకు తీశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

# 7 రకాల సన్న వడ్లకు బోనస్

- తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ గవర్నమెంట్ సిద్ధంగా ఉంది సీఎం రేవంత్ రెడ్డి.......

హైదరాబాద్/జూన్ 18/(జన సంఘర్షణ)




వానాకాలం సీజను ప్రభుత్వం రెడీ. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు. యాప్లో యూరియా బుకింగ్. రైతు వేదికల్లో పంపిణీకి సిద్ధం వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్. ఈ 7 రకాల 'సన్న' విత్తనాలకే రూ.500 బోనస్ సిద్ధంగా ఉంది రైతుల మేలే మాకు కావాలి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో సన్న వరి ధాన్యానికి ఇచ్చే బోనస్ కోసం 7 రకాల విత్తనాలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. BPT-5204, RNR-15048, HMT 3, KNM-1638, WGL-44, KNM-7715 5 సాగు చేస్తేనే క్వింటాల్కు రూ.500 బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. సీడ్ కంపెనీలు సైతం ఈ విత్తనాలకే ప్రాధాన్యం ఇస్తూ రైతులకు విక్రయించాలని లేఖలు రాస్తోంది. దీంతో ఈ విత్తనాలకు డిమాండ్ పెరగనుంది.

## పోతంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు...

పోతంగల్.../జూన్ 18/(జన సంఘర్షణ)




పోతంగల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అర్జున్ 28వ జన్మదిన వేడుకలను ప్రెస్ క్లబ్లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, శాలువాతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దత్తు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సమర్థులైన అధికారులకు సముచిత సత్కారం

బీర్కూర్ /జూన్ 18/(జన సంఘర్షణ)



ఏ అధికారి అయిన ప్రభుత్వ కార్యాలయానికి పనుల నిమిత్తం వస్తే అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు వచ్చిన రైతు గాని, గ్రామస్తుడు గాని ఆయనకు ఏ సమస్య ఎదురయింది, దానిని ఎవరు పరిష్కరిస్తారు? అన్న విషయంపై వారికి అవగాహన కల్పిస్తే వారు ఆ అధికారులను ఎప్పటికీ తమ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారు. అలాంటి అధికారులు బీర్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేసే బదిలీపై వెళ్లడం పట్ల బీర్కూర్ మండల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే అధికారులు బదిలీ కావడం పట్ల ముఖ్యంగా బీర్కూర్ ప్రజలు వారి సేవలను గుర్తు చేసుకున్నారు. సమర్థులైన అధికారులకు గ్రామ పెద్దలు గ్రామస్తులు యువకులు కలిసి బుధవారం ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా మండల కార్యాలయంలో సూపర్డెంట్ గ పనిచేస్తున్న భాను ప్రకాష్ పనితీరుపై గ్రామ పెద్దలు, యువత కొనియాడారు. అలాంటి అధికారి ఇక్కడి నుంచి బదిలీ కావడం పట్ల తమకు ఎంతో బాధ కలిగిస్తుందని గ్రామ సర్పంచ్ ధర్మతేజ వెల్లడించారు. గ్రామ సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో బీర్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ హోదాలో పనిచేసి బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిని శ్రీనిధి బదిలీపై వెళుతున్న అధికారులకు, కార్యదర్శులకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా శతవసంతాల ఉత్సవం

- బీర్కూర్‌లో వృద్ధురాలి శత వసంతాల వేడుక
- ఉత్సవ కార్యక్రమానికి హాజరైన నాలుగు తరాల కుటుంబ సభ్యులు

బాన్సువాడ,/జూన్ 18/(జన సంఘర్షణ)






బీర్కూర్ గ్రామంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ లో ఎన్నువార్ సాయమ్మ భర్త కీ.శే గంగారం వారి శతవసంతోత్సవ వేడుకలను నాలుగు తరాల కుటుంబ సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి మంగళ వాయిద్యాల మధ్య స్వాగతం పలికి ఆయురారోగ్యాల కోసం గణపతి పూజ, లలిత సహస్రనామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు, మనవళ్లు కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. శాలువా పూలదండ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పాత ఫోటోలు వీడియోలతో స్వాతంత్రం నుండి స్మార్ట్‌ఫోన్ వరకు వారు చూసిన అన్ని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి కుటుంబ సభ్యులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్ను వార్ సాయమ్మ పేరు మీద అన్నదానం, వృద్ధాశ్రమానికి విరాళం మొక్కలు నాటడం ఇలాంటి కార్యక్రమాలు చేశామని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నువార్ కుటుంబానికి చెందిన నాలుగు తరాల కు చెందిన అందరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తుని చిన్నారి మిస్సయిన చోట బొమ్మలు.. ఎందుకంటే?

ఆంధ్రప్రదేశ్/జూన్ 18/(జన సంఘర్షణ)



తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సైన ప్రాంతంలో బొమ్మలు ఏర్పాటు చేశామని డీఎస్పీ తిలక్ తెలిపారు. 'దర్యాప్తులో భాగంగా తోట, కొండ ప్రాంతం సరిహద్దు కంచె వద్ద పిల్లల ఆకారం పోలిన రెండు బొమ్మలను అమర్చాం. అందులో మాంసం ముక్కలు పెట్టాం. అడవి పందులు, ఇతర జంతువులు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకునేందుకు కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం' అని చెప్పారు. అటు జీడిపిక్కలు సేకరించే వారినీ విచారించామని పేర్కొన్నారు.

## వరుణ్ మోటార్స్ షోరూంలో చైర్మన్ సురేష్ బాబా చేతుల మీదుగా

- యూత్ కాంగ్రెస్ నాయకులు పైడిమల్ అశోక్ న్యూ ఎర్టిగ వాహనాన్ని డెలివరీ....

వర్ని/జూన్ 18/(జన సంఘర్షణ)




ఈరోజు వర్ని మండల కేంద్రం లోని వరుణ్ మోటార్స్ షో రూం లో ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా చేతుల మీదుగా యూత్ కాంగ్రెస్ నాయకులు పైడిమల్ అశోక్ న్యూ ఎర్టిగ వాహనాన్ని డెలివరీ చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల, చైర్మన్ సురేష్ బాబా, బాన్సువాడ కిసాన్ ఇన్చార్జి కిషన్, భారీ బాయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
19 జూన్ 2026

# దండలు రెడీ చేస్కోండి

**హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 18, (జన సంఘర్షణ):**



చట్టం న్యాయం ధర్మం అన్నీనేడు ఒక్కచోటే
మాటల్లేవ్ మాట్లాడటాల్లేవ్ మూడిందంతే...!
పుణ్యం పాపం దేవుడెరుగు అయినా దేవుళ్ళకే
శఠగోపం పెట్టే
సన్యాసుల కాలంలో వాటికి తావుందా...?
ఈ క్షణంపై చేయి పలుకుబడి, పరపతి,
పైసా ఉన్నోడిదే రేపెవడిదో...?
కోర్టులో గెలవొచ్చు, ఓడొచ్చు
ఆసుపత్రిలో రోగం కుదరొచ్చు,పోవొచ్చు
అదేంటో కొన్ని స్టేషన్ లలో
న్యాయానికి బదులు దండనే కాదు...!
దండలు రెడీ చెస్కొమ్మని హుకుం
బూడిద మిగల్చని తీర్పులు.

**– కొండూరి కోటిబాబు, హైకోర్టు అడ్వకేట్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.**

## మండల కేంద్రంలో అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, సూపర్వైజర్ స్వరాజ్

**పొతంగల్/జూన్ 18/(జన సంఘర్షణ**



పొతంగల్ అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, సూపర్వైజర్ స్వరాజ్. నిజాంబాద్ డిస్టిక్ బోధన్ డివిజన్లోని పొతంగల్ మండలం గురువారం అంబులెన్స్ని ఆకస్మికతనికి చేసి రికార్డులను పరిశీలించి అంబులెన్స్ ప్రజలు వినియోగించుకోవాలా ఉండాలని సూచించారు. అంబులెన్స్ లో కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు పరిశీలించి తీసివేయాలని ఆయన సూచించారు. రికార్డులను పరిశీలించి రోజు చేస్తున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవలు చేసే విధంగా అంబులెన్స్ ను ఉపయోగించుకునే విధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ అన్ని రకాల కేసులను చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ వైద్య సేవలు అందే విధంగా అంబులెన్స్ ను వినియోగించాలని ఆయన సూచించారు. పోతంగల్ అంబులెన్స్ లో వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరును పరిశీలించారు. పోతంగల్ అంబులెన్స్ సిబ్బంది రికార్డను రోగులను ఎటువంటి ఇబ్బంది లేకుండా వాళ్ళు చెప్పిన హాస్పిటల్ కి తీసుకెళ్లాలని బోధన్ ఏరియా హాస్పిటల్ తీసుకెళ్లాలని ఆయన సూచించారు. దీనిలో పోతంగల్ అంబులెన్స్ సిబ్బంది వి. నాగరాణి కే. నారాయణ పైలట్ ఎండికలింగ్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



- **శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి.**


**హైదరాబాద్ సిటీ,కుత్బుల్లాపూర్ ప్రతినిధి అంజిబాబు, జూన్ 18, (జన సంఘర్షణ):**

కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్,డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, అవిజే జేమ్స్ సిద్దనోల సంజీవరెడ్డి, లక్ష్మా రెడ్డి, రషీద్,మైసిగారి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్, సంతోష్ ముదిరాజ్, లాయక్, అజయ్, ప్రవీణ్ ముదిరాజ్ రంగన్న, మధుసూదన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# ఏసీబీకి చిక్కిన ట్రాన్స్కో ఏ ఈ రామకృష్ణారెడ్డి

- **రూ. 25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి**

**హైదరాబాద్ బొల్లారం/జూన్ 18/(జన సంఘర్ష ణ)**



ఏ పని కావాలన్నా లంచం, లంచం. లంచం ఇస్తే ఏ పని కూడా కాదు అనకుండా చేసి పెడుతున్నారు కొంతమంది అవినీతి అధికారులు. దీంట్లో మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ ఉండగా, రెండవ స్థానంలో విద్యుత్ శాఖ నిలిచింది. ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ, భూగర్భ గనుల శాఖ, పౌరసరఫరాల శాఖ, వైద్యశాఖ, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, ప్రభుత్వ కార్యాలయంలో అవినీతికి కొంతమంది అధికారులు ఎగబడుతున్నారు. ఈ పక్షం రోజుల్లోనే ఆరుగురు భారీ తిమంగళాలు ఏసీబీకి చిక్కాయి. వారి ఇళ్లల్లో సోదాలు చేస్తే కట్టల కొద్ది నోట్ల కట్టలు పడ్డాయి. మరొక అధికారి ఇంట్లో ఏకంగా బెడ్ కిందనే కోటి పది లక్షల రూపాయలు భద్రంగా అవినీతి సొమ్ము దాచుకున్నాడు చివరికి ఏసీబీ ఆ సొమ్మును బయటపెట్టింది. ఇకపోతే బంగారం, వెండి, వజ్రాలు, భారీ స్థిరాస్తులు బయటపడ్డాయి. జైలు గోడలు లెక్కబెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి మాత్రం ఆగడం లేదు. తాజాగా ట్రాన్స్కో ఏయి ఏసీబీ వలలో పడ్డాడు. జిన్నారం మండలం బొల్లారం డివిజన్పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ వ్యక్తి నుంచి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు రెడ్యండెడ్గా పట్టుకున్నారు. సమాచారం ప్రకారం.. బొల్లారంలోని పీపీఆర్ హాస్పిటల్ సమీపంలో ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ కాంట్రాక్టర్ విష్ణువర్ధన్రెడ్డి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు కేసు నమోదు కాకుండా చూసేందుకు సంబంధిత వ్యక్తి నుంచి ఏఈ రామకృష్ణారెడ్డి రూ.25 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచన మేరకు గురువారం మధ్యాహ్నం లంచం ఇస్తుండగా అధికారులు దాడి చేసి ఏఈని పట్టుకున్నారు. అనంతరం బొల్లారం విద్యుత్ సబ్ స్టేషన్లో ఏసీబీ అధికారులు తనిఖీలు, విచారణ చేపట్టారు. ఆయన ఇంట్లో బంధువుల ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారు.

# క్యాన్సర్ బాధితురాలికి తుడి లచ్చన్న ఆపన్న హస్తం

- **రూ. 10,000 ఆర్థిక సాయం అందజేత**
- **క్యాన్సర్ వ్యాధితో మంచాన పడ్డ తాళ్లపల్లి లత కుటుంబానికి ప్రత్యక్ష పరామర్శ**
- **ఆపదలో ఉన్న వారికి 'నేనున్నా' అంటూ భరోసా ఇస్తున్న ప్రముఖ సామాజిక వేత్త తుడి లచ్చన్న**
- **లచ్చన్న ఉదారత, మానవతా హృదయంపై నియోజకవర్గవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు**
- **నిరుపేద ప్రాణాన్ని కాపాడేందుకు దాతలు, ప్రభుత్వం మరింతగా ముందుకు రావాలని విజ్ఞప్తి**

**బోయినపల్లి/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: ( జన సంఘర్షణ )**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత అనే నిరుపేద మహిళ గత కొంతకాలంగా ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజిక వేత్త శ్రీ తుడి లచ్చన్న గారు తీవ్రంగా చలించిపోయారు. బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని ఓదార్చడమే కాకుండా, వారికి ఆర్థికంగా అండగా నిలవాలనే సంకల్పంతో ఈరోజు బూరుగుపల్లి గ్రామంలోని లత నివాసానికి స్వయంగా వెళ్లారు. లత నివాసానికి వెళ్లిన తుడి లచ్చన్న ఆమెను పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సహాయం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఖరీదైన మందులు, కీమోథెరపీ ఖర్చుల భారం మోయలేక సతమతమవుతున్న ఆ కుటుంబ దీనస్థితిని చూసి ఆయన హృదయం చలించిపోయింది. ఆమె తదుపరి వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా రూ. 10,000 (పది వేల రూపాయలు) నగదును కుటుంబ సభ్యులకు అందజేసి పెద్ద దిక్కుగా నిలిచారు.


**ఎవరు ఆపదలో ఉన్నా 'నేనున్నా' అంటూ భరోసా:**

ఈ సందర్భంగా తుడి లచ్చన్న మాట్లాడుతూ.. సమాజంలో ఎక్కడ ఎవరు కష్టాల్లో ఉన్నా, ఏ నిరుపేద ఆపదలో ఉన్నా అండగా నిలుస్తానని, తన శక్తానుసారం సహాయం అందిస్తానని భరోసా కల్పించారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, కష్ట సమయ ~ల్లో ఆపన్న హస్తం అందిస్తున్న లచ్చన్న సేవా గుణంపై బూరుగుపల్లి గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్, ఉప సర్పంచ్ కళ్ళేపల్లి చంద్రయ్య, వార్డ్ సభ్యులు అతికం రాజశేఖర్, తిరుపతి, వర్షిత, మహేష్, రాధ రమేష్ యువకులు పేరుక మహేష్, స్వామి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలకు సేవ చేయడం సిర్నూర్ గ్రామాన్ని అభివృద్ధి పరచడం

**దోంగ్లి/జూన్ 18/(జన సంఘర్షణ)**





కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలం సిర్పూర్ గ్రామంలోని 2వ వార్డులో రోడ్డంతా కాలువలగా మారి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ గజానంద్ పటేల్, రామ్ పటేల్ ల దృష్టికి తీసుకువెళ్లాగా ఆయన గ్రామ ప్రజల కష్టాలను చూసి చలించి వెంటనే స్పందించి కాలనీలో నల్లమట్టి, ఇసుకతో రోడ్డును వేయించి ప్రయాణాన్ని సులభతరం చేశారు. ప్రజలకు సేవ చేయడం. మన సిర్పూర్ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యం మని గజానంద్ పటేల్, రామ్ పటేల్. తమ సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు కాలనీ వాసులు, గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపిస్తూ, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్ , వార్డు సభ్యులు నాగు, గంగన్న, హజ్మద్ సాబ్, మునీర్, హైమద్, రాజాబోయి గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కనబడుట లేదు

**రుద్రూర్/జూన్ 18/(జనసంఘర్షణ)**



చిక్కడ్ పల్లి గ్రామానికి చెందిన విఘ్నేష్ S/O రవికుమార్ గురువారం మధ్యాహ్నం నుంచి కనబడుటలేదు. ఆచూకీ తెలిసిన వాళ్ళు...9494717131 ఈ నంబర్కు ఫోన్ చేయగలరని మనవి. ఆచూకీ తెలిసినవారు పై నెంబర్కు సంప్రదించండి.

## నాళేశ్వర్ గ్రామంలో ఘనంగా టిఆర్ఎస్ జండా పండుగ కార్యక్రమం

**బోధన్ జూన్ 18 జన సంఘర్షణ**




బోధన్ నియోజకవర్గం నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో కల్వకుంట్ల కవిత నూతనంగా ప్రారంభించిన తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని నాళేశ్వర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. టిఆర్ఎస్ పార్టి జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, రామ్ కిషన్ రావు .కల్వకుంట్ల కవిత నూతనంగా ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ లక్ష్యాలను సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసే దిశగా ఈ జెండా పండుగ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా తెలంగాణకు రక్షణగా ఈ తెలంగాణ రక్షణ సేనగా పార్టీ పని చేస్తున్నదని తెలంగాణ ప్రజలకు అండగా ఈ టిఆర్ఎస్ ఫార్టి ఉంటాదనని ప్రజలకు భరోసాను కల్పిస్తూ ఈ జెండా పండుగ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నవీనాచారి రామ్ కిషన్ రావు, కిషోర్, వరలక్ష్మి, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, ఆశిష్,కృష్ణ అవంతి రావు, ప్రవీణ్, లక్ష్మినారాయణ, జనార్ధన్, విజయలక్ష్మి, కరిపె రాజు, శంకర్, శ్రీనివాస్ గౌడ్, మహేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co